కారు.. ప్రచార జోరు

◆ నియోజకవర్గంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

◆ నిరంజన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రచారం

పెబ్బేరు, నవంబర్ 5: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పెబ్బేరు మండలంలో ఊపందుకున్నది. బీఆర్ఎస్ అన్నిపార్టీల కంటే ముందు ప్రచారం చేపట్టి దూసుకపోతోన్నది. ఇరవైరోజుల కిందటి నుంచే పార్టీ నాయకులు ప్రచారపర్వానికి తెరలేపారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి స్థానిక మున్సిపాలిటీలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి గ్రామాల్లో కార్యకర్తలు నిరంతరం పార్టీ గుర్తు అయిన కారుకు ఓటేయాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి రెండు దఫాలుగా మండలంలో పల్లెనిద్ర చేసి పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆమె పర్యటన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఉదయమే వీధిబాట పడుతూ మధ్యాహ్నం వరకు కొనసాగిస్తున్నారు. ప్రతి ఓటరు ఇంటికెళ్లి వ్యక్తిగతంగా కలుస్తూ మరోసారి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రతిఇంటికీ రెండుమూడుసార్లు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. త్వరలో మంత్రి నిరంజన్‌రెడ్డి కూడా పెబ్బేరు మండల పర్యటనకు రానున్నట్లు పార్టీవర్గాలు చెప్పాయి.

పాతపల్లిలో కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న సింగిరెడ్డి వాసంతి



కంభాళాపురంలో ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

శ్రీరంగాపురం, నవంబర్ 5: వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పరితపించే బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని సింగిరెడ్డి వాసంతి ఆదివారం మండలంలోని కంభాళాపురంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి వాసంతి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, సమస్యలను తీరుస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళలు, యువకులు, రైతులు తమ సహకారం అందించాలని కోరారు. పేదలకు తెలంగాణ ప్రభుత్వం, మంత్రి నిరంజన్‌రెడ్డి ఎల్లప్పుడు తోడుగా ఉంటారని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్ల మాయమాటలు వింటే ప్రజలు ఆగమైపోతారని సూచించారు. బీఆర్ఎస్ పాలనతోనే సువర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను ప్రతిగడపకూ చేరేవేసి ఓటర్లకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఎంపీపీ గాయత్రి, రైతుబంధు మండలాధ్యక్షుడు గౌడ్‌నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసిలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డికి భారీ మెజార్టీని అందించాలి

పెద్దమందడి, నవంబర్ 5: పెద్దమందడి మండలానికి సాగునీరుతోపాటు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి మరోసారి భారీ మెజార్టీని అందించాలని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెల్టూరులో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరంతరం అభివృద్ధి పనులపైనే దృష్టి పెట్టి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచిన నిరంజన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వారు గెలిచేది లేదని ధీమా వ్యక్తం చేశారు. అందుకని ప్రజలు ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

అదేవిధంగా మండలంలోని దొడగుంటపల్లిలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి ఆధ్వర్యంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటిటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వేణుయాదవ్, వెంకటయ్య, శశివర్ధన్‌రెడ్డి, రాజమహేంద్రరెడ్డి, జానకిరాములు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చెన్నారెడ్డి, గోపాల్, సురేశ్, కొమ్ము చెన్నయ్య, రవీందర్, రాజగౌడ్ తదితరులు ఉన్నారు.

వెల్టూరులో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

దొడగుంటపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

సంక్షేమ పథకాలను వివరించాలి

◆ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోదండం

పాల్కెపహాడ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోదండం

గోపాల్‌పేట, నవంబర్ 5: సీఎం కేసీఆర్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గాజుల కోదండం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండంలంలోని పాల్కెపహాడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీశ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం రాత్రి గ్రామంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి పల్లెనిద్ర చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం లక్ష్మీదేవమ్మపల్లి, కర్నమయ్యకుంట తండాల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీశ్రేణులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పల్లెనిద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వనపర్తి జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధిలో ముందు వరసలో ఉంచిన మంత్రి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. అందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ మతీన్, రైతుబంధు గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు వడ్డెమాన్ రవి, వార్డు సభ్యులు నాగయ్య, పులేందర్, నాయకులు మంద కోటీశ్వర్‌రెడ్డి, మునీంద్ర, రాములు, బంగారయ్య, మల్లయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

రవీందర్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరు, నవంబర్ 5: పెబ్బేరుకు చెందిన సిద్ధి రవీందర్ ఇటీవల అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. పెబ్బేరు, చెలిమిల్ల అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ దంపతులు ఆయనను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అక్కమ్మ, బాలస్వామి, శివశంకర్, సంతోష్, రాజశేఖర్, రాములు, భగవంతు, రంజిత్ పాల్గొన్నారు.

దాశరథి కృష్ణమాచార్యకు ఘననివాళి

ఖిల్లాఘణపురం, నవంబర్ 5: తెలంగాణ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు విక్రమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ విముక్తి కోసం తుదిశ్వాస దాకా తన రచనలు, కవితలతో తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి ఉద్యమానికి ప్రేరణనిచ్చారన్నారు. వందల పాటలను రచించి తెలుగు సినీ సాహిత్యానికి ఎన్నో సేవలందించారని గుర్తుచేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ఖిల్లాలో దాశరథికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శబరికి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్, నవంబర్ 5: శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. శబరిమలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులను ఏర్పాటు చేసిందని నూతన సూపర్ లక్షరీ బస్సులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో టీవీ, సెల్‌ఫోన్ చార్జింగ్ సౌకర్యం ఉందని, ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంటవారు, సామాన్లు సర్దేందుకు ఒక వ్యక్తికి సీట్లు లేకున్నా ప్రయాణించొచ్చని, బస్సును బుక్ చేసుకున్న గురుస్వామికి ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని, పుణ్యక్షేత్రాలను సందర్శించుకునే వెసులుబాటు ఉందన్నారు. రాయితీతో కూడిన ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని, భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9959226 289,7382 828101 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం

పెబ్బేరు, నవంబర్ 5: పెబ్బేరులో ఆదివారం కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. సుమన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ టెస్టులో పెబ్బేరు, కొత్తకోటకు చెందిన 80మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఏఎస్సై జయరాములు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంజీవ్, శ్యాంసుందర్, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బెల్టులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, నవంబర్ 5: జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో వాణిజ్యశాస్త్రం (కామర్స్) పోస్టు ఖాళీగా ఉందని, పీజీలో 55శాతం, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని, ఈనెల 7 సాయంత్రం 4గంటల్లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, డెమో, ఇంటర్వ్యూ ఈ నెల 8న ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు.